# లోకక్షేమం ప్రధానం

**విశ్వమందు విభుడు వెలుగొందుచుండును**
**విభునియందు వెలుగు విశ్వమెపుడు**
**విభుడు లేకయున్న విశ్వంబులేదయా**
**విశ్వవిభులమైత్రి శాశ్వతంబు**

ప్రేమస్వరూపులారా!

'మానవుని సుఖదుఃఖాలకు మూలం మనసే', అని మనసారా విశ్వసించి, రాగద్వేషాలను విషయవాసనలను దూరం గావించడానికి ప్రయత్నించడమే మానవత్వము. నిర్వికారమైన మనస్సే నిర్విచార జీవనానికి పునాది. మానవుడు అనుభవించే సుఖదుఃఖాలు, రాగద్వేషాలు, విషయ వాసనలకు మూలకారణం మనస్సే! ఇది వేరు, తాను వేరు అనే ద్వైతభావమున్నంత వరకు ఈ వికారములు తప్పినవి కావు. లోకమేమైనా కానీ తానుమాత్రం క్షేమంగా ఉండాలన్న స్వార్థభావానికీ ద్వైతమే ఆధారం. ఈ ద్వైతభావంచేతనే మనస్సులోని రాగద్వేషాలు అభివృద్ధి అవుతున్నవి. ఈ ద్వైత భావానికి అతీతమైన అద్వైతాన్ని మానవుడు నిర్మించుకోవాలి. ప్రతికణములో ప్రతి అణువులో దివ్యత్వం అంతర్భూతమై వున్నదన్న సత్యాన్ని అనుభూతికి తెచ్చుకోవాలి.

**ఆంతరంగిక పరిశుద్ధత**

మనసులోని మాలిన్యాలను మంత్ర తంత్రాలచేతగాని, యంత్రాలచేతగాని నిర్మూలించడానికి వీలులేదు. ఇది కేవలం ఆంతరంగిక పరిశుద్ధతద్వారామాత్రమే సాధ్యమవుతుంది. ఆంతరంగిక పరిశుద్ధతకోసం పాండిత్యం అక్కర లేదు. గొప్ప తెలివితేటలు అక్కర లేదు. సర్వకర్మలను భగవత్ప్రీత్యర్థంగా భావించి నిర్మలంగా,

sri sathyasaivachanamrutam

నిశ్చలంగా, నిస్వార్థంగా వాటిని సాగించడమే సరియైన సాధన.

గిన్నెలోని తైలంలో కన్పించే చంద్ర ప్రతిబింబాన్ని దూరం చేయడానికి ఎంత ప్రయత్నించినా అది సాధ్యం కాదు. పాత్రను అగ్నిలో కాల్చినప్పటికీ దానిలోని తైలంలో కన్పించే ప్రతిబింబాన్ని దూరంచేయడం సాధ్యం కాదు. ప్రతిబింబానికి ఆధారం తైలంకాని మరొకటి కాదు. పాత్రలో తైలమున్నంతవరకు ప్రతిబింబం కన్పిస్తూనే ఉంటుంది.

**పుట్టపైన మర్దించిన పాము మరణమొందునా?**
**తనువు తా దండించిన విషయభోగములణగునా?**
**ఆకలిదప్పులు వదలిన ఆత్మజ్ఞాని తానగునా?**
**తానెవరో తెలియకున్న తత్వజ్ఞాన మెట్లుకుదురు?**

తానెవరు? తన తత్వమేమిటి? తన గమ్యమేమిటి? తన సత్యాన్ని తాను మొట్టమొదట విచారించుకోవాలి. ఆ దివ్యత్వాన్ని గుర్తించినప్పుడే అన్నీ సులభంగా అర్థమవుతాయి. దివ్యత్వం లేని వస్తువేదీ జగత్తులో కానరాదు. ఆ దివ్యత్వాన్ని తానుమాత్రమే గుర్తించాలి గాని దివ్యత్వాన్ని గుర్తించే అధికారం దివ్యత్వానికి లేదు.

**ఫలములోని మధుర రసము ఫలము తాను ఎరుగునా?**
**పూవులోని మకరందము తీగలనుభవించునా?**
**కావ్యములోని మధుర రసము గ్రంథమనుభవించునా?**
**నివృత్తిసార సాహిత్యము ప్రవృత్తి పండితుడెట్లెరుగును?**

తన్నుతాను తెలుసుకోవడానికి తానే మూలాధారం. కాని, మానవులు ఈ సత్యాన్ని గుర్తించక తాము భక్తులమని, జ్ఞానులమని, యోగులమని తమకు తాము బిరుదులు తగిలించుకొంటూ వుంటారు. రామ భక్తులము, కృష్ణ భక్తులము, సాయి భక్తులము అని తమంతట తామే చెప్పుకోవడం చాలా సులభం. కాని, ఆచరణ రూపకంగా ఆ ప్రేమసన్నిధి చేరడం చాలా కష్టం. దీనికి మానవునిలో ఉండే ఒక సూక్ష్మతత్త్వాన్ని అర్థం చేసుకోవలసి ఉంటుంది. తాను దేహానికి, మనస్సుకు, ఇంద్రియాలకు అతీతమైన తత్త్వమని మొట్టమొదట గుర్తించాలి. దేహమనో ఇంద్రియభావంతో జీవించినంతవరకు తన యథార్థ

srisathyasaivahiniamrutam

స్వరూపాన్ని మానవుడు గుర్తించలేడు, అర్థం చేసుకోలేడు. ఆ రహస్యాన్ని తెలుసుకోవడానికి పండితుడు కానక్కర లేదు. వంట అయ్యేంతవరకు మాత్రమే కట్టెలతో మనకు పని. వంట వండుకున్న తర్వాత కట్టెలతో మనకు పనిలేదు.

**జీవన రహస్యం**

ఒక చేప పెద్ద ప్రవాహములో తేలుతూ మునుగుతూ ఆడుతూ ఆనందంగా సంచరిస్తూ వుంటుంది. దీనికి కారణమేమిటి? చేపకు ఈత రహస్యం తెలుసు కనుక ఎంతపెద్ద ప్రవాహమైనా అది నీటిలో సుఖంగా హాయిగా ఆనందంగా జీవించగలుగుతుంది. అదే జంతువులందు పెద్ద దేహం కలిగిన ఏనుగు ఈత విషయం తెలియక ప్రవాహంలో కొట్టుకొనిపోతుంది. చిన్న చేపకు, పెద్ద ఏనుగుకు ఉన్న వ్యత్యాసమేమిటి? ఈత తెలుసుకోవడమే. అది తెలిస్తే ఎట్టి ప్రమాదం లేకుండా సుఖశాంతులతో జీవించడానికి వీలవుతుంది.

ఇసుకలో చేరిపోయిన చక్కెర ముక్కను చీమ సులభంగా వెతికి గుర్తించి తినగలుగుతుంది. చక్కెర రుచి గుర్తించలేని ఏ ప్రాణియైనా చక్కెరను వేరుచేసి ఆరగించి ఆనందించలేదు. ఇదేవిధంగా మానవుడు ఎన్ని విద్యలు చదివినా, ఎన్ని శాస్త్రములు తెలుసుకున్నా, ఎన్ని వేదములు పఠించినా ప్రధానమైన రహస్యము తన తత్త్వము, తన కీలకము, తన గమ్యము, తన ఉనికిని తాను గుర్తించనంతవరకు ఇవన్నీ ఆడంబరములైన వేషములే! విద్యలుకాని, పాండిత్యము లేక తెలివితేటలుకాని మానవునికి శ్రేయస్సును గురించి బోధిసాయేగాని ఆచరణరూపంగా అందించవు. ఇవన్నీ గైడ్‌పోస్టులు, మార్గదర్శక ఫలకాలవంటివి. ఇవి మార్గమును చూపగలవేగాని మార్గములో నడిపించలేవు. నడిచినప్పుడే గమ్యమును చేరుకోగలముకాని నడువకుండా బోర్డును చూసుకొంటూ ఉన్నంత మాత్రాన గమ్యాన్ని చేరలేము. కనుక, ఆచరించడానికి ప్రయత్నించడమే మన ప్రధాన కర్తవ్యం. చరిత్రను చదివినంత మాత్రాన చరిత్ర రహస్యాన్ని గుర్తించలేము. మన చరిత్రను మనము సృష్టించుకోవడానికి ప్రయత్నించాలి.

నీటిలో గొంతువరకు మునిగినా మాట్లాడవచ్చును. కాని, పూర్తిగా మునిగిన వ్యక్తి ఎట్టి



srisathyasaivachanamrutam

మాటలను మాట్లాడలేదు. అదేవిధంగా పవిత్రమైన పరమ ప్రేమతత్త్వంలో పూర్తిగా మునిగిఉంటే ఇట్టిది, అట్టిది అని చెప్పుటకు సాధ్యంకాని స్థితిలో ఉంటాము. దివ్యత్వముయొక్క తత్త్వాన్ని అధికంగా బోధించడంగాని, వర్ణించడంగాని పూర్ణత్వాన్ని గుర్తించడానికి పూర్వము జరిగే పనులని మనం గుర్తించాలి. భగవంతుని ప్రేమరసామృతాన్ని పూర్తిగా గ్రోలినవారు వర్ణించడానికి ప్రయత్నించరు. ముఖ్యంగా మనస్సుయొక్క వికృత స్వరూపాన్ని అణగద్రొక్కడానికి మనం ప్రయత్నించాలి. నిర్వికారులమయ్యేవరకు నిర్విచార స్థితిరాదు. కష్టనష్టాలలో, రాగద్వేషాలలో, సుఖదుఃఖాలలో సమత్వాన్ని అభివృద్ధి పరచుకోవడానికి తగిన సాధన చేయాలి. సమత్వమే యోగమని సిద్ధాంతం. సమత్వమే అద్వైతం. ఇది ఏకత్వాన్ని నిరూపిస్తుంది. అదే ప్రధానమైన జ్ఞానం. 'అద్వైత దర్శనం జ్ఞాన'మన్నారు. అందరిలో సర్వత్రా దైవత్వాన్ని గుర్తించడానికి మనం ప్రయత్నించాలి.

'మానవుని జీవితంలో సంభవించే ఒడిదుడుకులన్నీ మనోవికారాలవల్లనే', అని ఇదివరకే చెప్పాను. 'మనయేవ మనుష్యాణాం కారణం బంధమోక్షయోః' బంధానికైనా మోక్షానికైనా మనస్సే కారణం. ఎన్ని యుగాలు గడిచినా, ఎన్ని జగాలు కదిలినా, మనస్సు మారకపోతే అన్నీ భ్రాంతులుగానే మిగిలిపోతాయి. మనసును మరపించేది, హృదయాన్ని మురిపించేది ఆత్మతత్త్వమన్న విషయాన్ని గుర్తించాలి. అట్టి దివ్యత్వము కంటికి కన్పించదు, చెవులకు వినిపించదు, మనసుకు అనిపించదు. హృదయానికి మాత్రం తెలుస్తుంది. అదే మానవతత్త్వము. అట్టి శబ్ద బ్రహ్మతత్త్వాన్ని మనము నిరంతరము సర్వదా సర్వత్రా సర్వకాలాల్లో హృదయంలో చింతించడానికి, దర్శించడానికి తగిన కృషి చేయాలి.

**విధి విధాతలు**

ప్రాకృతమైన జీవితానికి కొన్ని నియాలు అత్యవసరము. ఆ నియమాలు లేకున్న మనము నీతిగా జీవించడానికి వీలుకాదు. నీతి నిజాయితీలు పెంచుకోవడానికి, ఆచరించడానికి ఈ నియమాలు అత్యవసరం. మహర్షులు అనేక అనుభూతులతో కాల నిర్ణయాలను గుర్తించారు. మహాభారతములో ఆదిపర్వంలో ఉదంకుని చరిత్రలో సంవత్సర స్వరూపుని

నిరూపణ ఉంది. ఉదంకుడు గుర్వాజ్ఞను శిరసావహించి తాను సాధించవలసిన కర్మ నిమిత్తమై ఒక ప్రదేశానికి చేరాడు. అక్కడ ఇద్దరు వ్యక్తులు నలుపు తెలుపు రంగులలో ఉన్న దారాలతో నేస్తున్నారు. దానికి సమీపంలోనే పన్నెండాకుల చక్రమున్నది. దానిని ఆర్గురు వ్యక్తులు నిర్విరామంగా త్రిప్పుతున్నారు. వీరెవరా అని ఉదంకుడు యోచించాడు. వేద శ్లోకాలను జ్ఞప్తికి తెచ్చుకున్నాడు. ఈ ఇరువురు వ్యక్తులు విధి విధాతలు. ఈ విధి విధాతలే లేకపోతే మానవత్వానికి అర్థమే లేదు. వీరు తెలుపు నలుపు దారాలతో పడుగు పేకగా అల్లుతున్నారు. ఇవేమిటంటే రాత్రింబవళ్ళు. పగలు తెలుపు, రాత్రి నలుపు. ఈ రెండింటిని పడుగు పేకలుగా నేస్తున్నారు. పన్నెండు ఆకులున్న చక్రమేమిటంటే 12 నెలలతో కూడిన కాలము. 12 నెలలతో కూడిన ఈ కాల చక్రాన్ని ఆరు ఋతువులు త్రిప్పుతున్నాయి. ఇక్కడ మనము గుర్తించవలసినది రాత్రి, పగలు అనేవి లేకపోతే నెలలు అనేవే ఏర్పడవు. నెలలు లేకున్న ఋతువులే కలుగవు. ఋతువులే లేకున్న జగత్తు నడువదు. ఇవన్నీ కాలస్వరూపము. ఈ జగత్తును సంరక్షించి, పోషించి పాలించి, ఉద్ధరించే నిమిత్తమై ఏర్పడినవాడు సంవత్సర స్వరూపుడని నిర్ణయం చేసుకున్నారు. నాణేనికి రెండు ముఖాలున్నట్లు కాలానికి రెండు రూపాలున్నాయని భారతీయ విశ్వాసం. ఒకటి జగత్స్వరూపము, రెండవది జగత్స్వభావము. స్వరూప, స్వభావాలతో కూడినది ఈ కాల స్వరూపము.

నేటితో అక్షయ నామ సంవత్సరం ప్రారంభమైనది. క్షయ, అక్షయములు రెండూ చేరినది ఈ అక్షయము. అ అనగా ఆత్మస్వరూపము శాశ్వతమైనది. క్షయ అనగా జీవ స్వరూపము మార్పు చెందేది. అక్షయ అనగా 'జీవేశ్వర స్వరూపము', అని దీని అర్థము. అశాశ్వతమైనది. ఒకే పదములో క్షర, అక్షరములు రెండూ అనగా శాశ్వత, అశాశ్వతములు ఇమిడి ఉన్నవి. మానవత్వము క్షరాక్షరములతో కూడినది. క్షరమేమిటి? అక్షరమేమిటి? అనే సత్యాన్ని గుర్తించడానికి ప్రయత్నించాలి. భారతీయులైనా, విదేశీయులైనా ఈ నెలలకు, ఋతువులకు కొన్ని ఆధారాలను చేసుకొని వ్యవహరిస్తూ వచ్చారు. ఏ నెలల పేర్లైనా దైవత్వం స్వభావం పూర్ణంగా నిండి ఉంటుంది. జనవరి, ఫిబ్రవరి, మార్చి, ఏప్రిల్, మే, జూన్ మొదలైన నెలలో పేర్లలో దేవతల పేర్లు, రాజుల పేర్లు, కొన్ని సంఖ్యలు వున్నాయి.

srisathyasaivahini.org

ఆగస్టస్ రోమన్ చక్రవర్తి. జెనుస్ ఒక దేవత. సెప్టో, అక్టో, నవం అంకెలు మన సప్తమి, అష్టమి, నవములతో ఇవి కలుస్తాయి. భారతీయ, రోమన్, లాటిన్ భాషాపదాలకు సన్నిహిత సంబంధమున్నది. దేశాలు వేరైనా, భాషలు వేరైనా, పదములు ఒకటే.

**మంచి చెడ్డలు**

బైరాగి శాస్త్రి చెప్పాడు, "చంద్రుడు ఒక్కడైనా ప్రతిబింబాలు అనేకంగా కన్పిస్తుంటాయ"ని. అదే విధంగా సూర్యుడు ఒక్కడైనా అనేక పాత్రలలో అనేక సూర్యులున్నట్లు కన్పిస్తుంది. ఒక చెట్టుపైన సూర్యుని వెల్తురు పడినప్పుడు కొమ్మలు రెమ్మలలోనుండి ఆ నీడలు కన్పిస్తుంటాయి. నీడకు ప్రక్కలో వెల్తురుంటుంది. వెల్తురు ప్రభావంకూడా నీడలో ఉంటుంది. వెల్తురు ప్రభావం లేకపోతే నీడ కన్పించదు. బింబం ప్రతిబింబం రెండింటిలోను ప్రకాశం ఒకటిగానే వుంటుంది. ప్రాపంచికంగా బింబ, ప్రతిబింబములు వేరుకాని, దైవస్థితిలో రెండూ సమానంగానే ఉంటాయి. నీడ కన్పిస్తున్నదంటే ఏ విధంగా కన్పిస్తుంది? ప్రక్కన వెల్తురు ఉండటంచేత నీడ కన్పిస్తున్నది. ప్రకాశమే లేకున్న నీడకూడ కన్పించదు. చీకటి కన్పించాలంటే ప్రక్కన వెల్తురు ఉండాలి. అదేవిధంగా సుఖదుఃఖములకు మనసు అనే సూర్యుడు ఒక్కడే అయినప్పటికీ వికారములనేవి తననుండి ప్రారంభమైనవే అనే సత్యాన్ని మనం గుర్తుంచుకుంటే చాలు.

కాలములో మంచి, చెడ్డలు లేకుండా ఉండటానికి వీలులేదు. 'జ' అనగా పుట్టడం, 'గతి' అనగా మారడం. పుట్టడం మారడంతో జగతి అనే పేరు సార్థకమైనది. జ్యోతిశ్శాస్త్రము ప్రకారం ఈనాడు గురువారము, చైత్రశుద్ధ పాడ్యమి. ప్రతి సంవత్సరానికి నవనాయకులుంటారు. తొమ్మిదిమందిలో నలుగురు ఉత్తములుగా ఉన్నారు. మొదటివాడు బృహస్పతి రాజు, రెండవవాడు చంద్రుడు మంత్రి, శుక్రుడు రసాధిపతి, బుధుడు నీరసాధిపతి నలుగురు. ఈయేడు లోకోద్ధరణకు, లోక పరిపాలనకు, లోక శాంతికి ప్రధాన నాయకుడు రాజు. నిరంతరం ప్రజాక్షేమాన్ని గురించి యోచిస్తుంటాడు. కనుక, రాజు ప్రజలకు అనుకూలుడుగా ఉన్నాడు. రాజు మాత్రమే అనుకూలంగా వుండి మంత్రి అనుకూలంగా లేకపోతే కొన్ని అవకతవకలు జరుగవచ్చు. మంత్రికూడా రాజుకు

sri sathyasai vahamrutam

అనుకూలంగా వున్నాడు. రాజు, మంత్రి, వీరి ప్రేమ ప్రజలపై ఉంటే ప్రజలకే ఆపద, భయమూ వుండదు. అంతేగాక వేదములో 'చంద్రమామనసోజాతః చక్షోస్సూర్యో అజాయతః' అని వున్నది. చంద్రుని, మనసును బింబ ప్రతిబింబములుగా పోల్చారు. మనస్సు ప్రతిబింబమే చంద్రుడు, చంద్రుని ప్రతిబింబమే మనస్సు. ఇరువురికి అవినాభావ సంబంధమున్నదని వేదము నిరూపించింది. ఈ సంవత్సరానికి చంద్రుడనే సద్గుణమూర్తి నాయకుడుగా ఉండటం చేత మనస్సు తత్వం ప్రశాంతంగా రూపొందుతుంది.

**ప్రచారము కాదు ఆచరణ**

మనిషి అనగా మనస్సే. మనస్సనగా తలంపుల చేరికే! తలంపులనగా నిత్యజీవిత పరిణామములే! మన నిత్యజీవితములో నడతలు సక్రమంగా ఉంటే మనస్సుకూడా శాంతి, భద్రతలతో ఉండగలదనడానికి ఎట్టి సందేహం లేదు. మన మనసు ఉండవలసిన రీతిగా ఉండటం లేదంటే మన నడత ఉండవలసిన రీతిగా లేదన్న మాట. కనుక, మనిషి అనగా నడతయే! అదే ప్రధానమైన ప్రాణం. ఈనాడు మానవత్వం కేవలం ఆకారంలోనే కన్పిస్తున్నది తప్ప ఆచరణకు అతి దూరంగా ఉంటున్నది. ధర్మప్రచారములు కావలసినంత అభివృద్ధి అయిపోయాయి. ధర్మప్రచారం కాని ధర్మబోధ కాని జగత్తులో ఏమాత్రం తక్కువలేదు. ప్రచారకుల సంఖ్య పెరిగిపోతున్నది, కాని ఆచరణలో పెట్టేవారి సంఖ్య తగ్గిపోతున్నది. బోధించడం కాదు, ఆచరించడానికి పూనుకోవాలి. నూరు చెప్పడం కంటే ఒక్కటి చేసి చూపించడం మంచిది. మూలాధారమైన తత్త్వాన్ని గుర్తించకుండా బాహ్యమైన ఆచరణకు మాత్రమే జీవితాన్ని అంకితం చేస్తున్నాము.

కొన్ని మూఢాచారాలు కూడా ఉన్నాయి. వీటిని జాగ్రత్తగా గమనించాలి. ఒక ఉదాహరణ. దేవాలయానికి వెళ్ళి దేవునికి టెంకాయ కొట్టాలనుకుంటాం. టెంకాయ కొట్టాలి అనుకున్నాం కాని, టెంకాయ మంచిదా కుళ్ళినదా చెడినదా అనే విషయం అంతగా పట్టించుకోము. టెంకాయ కుళ్ళితే మరీ మంచిది, కోర్కె నెరవేరినట్లేనని భావిస్తాము. అంతటితోనే తృప్తి పడుతున్నాం. ఈ కొబ్బరి కాయ తత్త్వమేమిటి? ఇది మన హృదయగ్రంథి. పై పీచు అంతా తమోగుణ తత్త్వం. దానిపైని చిప్ప రజోగుణ తత్త్వం. ఆ

srisathyasaivachanamrutam

చిప్పకు కరచుకొని ఉన్న పరిశుద్ధమైన కొబ్బరే సాత్త్విక తత్త్వం. అట్టి పరిశుద్ధ హృదయాన్ని పరమాత్మకు అర్పించాలనే స్వభావాన్ని అభివృద్ధి పరచుకోవాలి. కొబ్బరికాయను ఏ రీతిగా మనం పరమాత్మునికి అంకితం గావించాలి? పైన పీచు ఉన్నంతవరకు ఎన్ని విధాలుగా మనం ప్రయత్నించినా అది పగలడానికి వీలుండదు. ఆ పీచు అనగా తమోగుణాన్ని తీసివేయాలి. మూర్ఖత్వాన్ని నిర్మూలం చేసుకోవాలి. రజోగుణమనే చిప్పను కూడా పగులగొట్టాలి. అప్పుడు సాత్త్వికత్వమనే పవిత్రమైన కొబ్బరి పరమాత్మకు అర్పితమవుతుంది. హృదయం పరిశుద్ధంగా ఉన్నప్పుడే పరమాత్మకు అర్పితం గావించాలనే భావం అభివృద్ధి పరచుకోవాలి గాని ఏదో అనుకున్నాను, కొబ్బరికాయ కొట్టాను చెడిపోతే చెడ్డ భావం, బాగుంటే మంచి భావం అనుకోవటం మూర్ఖత్వం. కొబ్బరికాయ తీసుకునే సమయంలోనే మంచి చెడ్డలు చూసి తీసుకోవాలి.

మరికొంతమంది మందిరంలోకి వెళ్ళి కూర్చుంటే చాలుననుకొని వెళ్ళి కూర్చుంటారు. కేవలం పవిత్రమైన ప్రదేశమని భావించి వెళ్ళి కూర్చున్నంత మాత్రాన ప్రయోజనం లేదు. దేవాలయంలో మనం కూర్చున్నప్పుడు దైవ చింతన మనలో కూర్చోవాలి! తాను దేవాలయంలో కూర్చొని తనలో దేవుని కూర్చోబెట్టుకోవాలి. 'దేహో దేవాలయ ప్రోక్తో జీవో దేవ స్సనాతనః!' దేహం మాత్రం దేవాలయంలో కూర్చొని మనస్సును బజారులో వదలిపెడితే అది పవిత్రమైన స్థానంలో ఉన్నట్లేనా?

ఇంక మూడోది. మంత్రాలు చెప్తూతూ వుంటాము గొప్పగా. కాని ఆ మంత్రం అర్థం కించెత్తైనా తెలుసుకొని చెప్పినప్పుడే మంత్రానికి సార్థకత్వం ఉంటుంది. అర్థము తెలియని మంత్రము, పవిత్రత లేని హృదయము, చెడిపోయిన కొబ్బరికాయ ఈ మూడింటికి ఒకే ఫలితం. కనుక ప్రతి చిన్న కర్మలో కూడా అందులో ఉన్న నిశ్చలత్వాన్ని నిర్మలత్వాన్ని పవిత్రతను గుర్తించి వర్తించాలి. ఎన్ని కష్టములు, నష్టములు, దుఃఖములు కలిగినా భగవంతునినుండి మన భావం కించిత్తైనా చలించరాదు. చెవులు పగిలిపోయేటట్లు మించులు (మెరుపులు) మించుతున్నా, భయంకరమైన మబ్బులు క్రమ్ముకొంటున్నా, కుంభవర్షము కురుస్తున్నా, చాతక పక్షి ఆ వర్ష బిందువులకోసమే ప్రాకులాడుతూ

srisathyasaivachanamrutam

వుంటుంది. త్యాగానికి సిద్ధమై ఆనందాన్ని అనుభవించడానికి పూనుకొంటుంది. త్రాగడానికి ఎన్ని నదులలో నీరు లేదు? ఎన్ని చెరువులలో నీరు లేదు? ఎన్ని బావులలో నీరు లేదు? కాని ఆ నీరు త్రాగడానికి ఏమాత్రం అంగీకరించదది. పవిత్రమైన జలబిందువు కోసమే ప్రాకులాడుతుంటుంది. అట్లే ఎన్ని అనుకూలాలు, ఎన్ని సుఖాలు, ఎన్ని సౌఖ్యాలు, ఎన్ని సదుపాయాలున్నా లెక్కచేయక ఒక్క దైవసన్నిధినే పెన్నిధిగా భావించి దానినే ప్రధానంగా లక్ష్యంలో పెట్టుకోవాలి. ఎన్ని చిక్కులు వచ్చినా లెక్కచేయకుండా త్యాగానికి పూనుకోవాలి.

**నీకేనా శాంతి కావలసింది?**

కోరికలుకూడా చాలా చిత్రంగా ఉంటాయి. ఒక చిన్న ఉదాహరణ. 'నాకు మనశ్శాంతి కావాలి', అనేది ఎంత స్వార్థంతోకూడిన కోర్కెనో మీరు ఆలోచించండి. లోకానికి ఏ గతి పడితే నాకేమి! నా శాంతి నాకు కావాలి అంటే ఎంత స్వార్థమది? గృహమే శాంతంగా లేనప్పుడు నీకు శాంతి ఎట్లా లభిస్తుంది? నీవు ఒక్కడవు మాత్రమే శాంతిగా ఉండడానికెట్లా సాధ్యమవుతుంది? నీ శాంతి నీ కుటుంబంపైన, నీ సమాజంపైన, నీ జగత్తుపైన ఆధారపడి ఉంటుంది. జగత్తు, సమాజం, గృహం శాంతిగా ఉంటే నీకు శాంతి. కోరడం ఒక్కటే తెలుసు కాని అందు కవలంబించవలసిన విధానమేమిటో తెలియకుండా పోతున్నది. మానవుడు తనను తాను ప్రేమించడానికికూడా పరులను ప్రేమించక తప్పదు. పరులను ప్రేమించగలవాడే తన్ను తాను ప్రేమించగలడు. పరులను ప్రేమించక తనపై తనకు ప్రేమ జనించదు. యుద్ధంలో విజయం సాధించాలనే వ్యక్తికి అతనితో యుద్ధం చేసేవాడు మరొకడు ఉండాలికదా! యుద్ధమే చేయనప్పుడు యుద్ధంలో జయించానని చెప్పుకోవడానికి అధికార మెట్లా వస్తుంది!

అనేక మంది జలం ఉనికిని, భూమి తత్వాన్ని తెలుసుకోవడానికి కొన్ని ప్రయత్నాలు చేస్తుంటారు. బావి త్రవ్వాలంటే చుట్టుప్రక్కల మురికినీటిగుంట ఏదీ లేకుండా చూస్తారు. కారణమేమంటే అదే జలం బావిలో ఊరుతుంది. మద్రాసులో కాని బొంబాయిలో కాని లేక సముద్రానికి దగ్గరలో ఉన్న మరే ప్రాంతంలోనైనా బావి త్రవ్వితే ఉప్పునీళ్ళే పడతాయి గాని

sri sathyasai vachanamrutam

మంచినీళ్ళు రావు. చుట్టూ అపవిత్రమైన, అసహ్యమైన, అసభ్యమైన వాతావరణాన్ని పెట్టుకొని శాంతిగా ఉండాలంటే శాంతి ఎట్లా లభిస్తుంది? నీకు శాంతి కావాలనుకున్నప్పుడు నీ చుట్టూ ఉన్న పరిసరాలను శాంతంగా తీర్చిదిద్దుకో! దీని అంతరార్థ మేమిటనగా 'లోకశాంతే నా శాంతి', అనే విశాలమైన భావాన్ని అభివృద్ధి పరచుకోవాలి. కనుకనే ప్రాచీన భారతీయ సంస్కృతిననుసరించి పూర్వము 'లోకాస్సమస్తా స్సుఖినోభవంతు' అందరు సుఖంగా ఉండాలని విశాలమైన భావంతో కోరేవారు. లోకశాంతిని మనం కోరినప్పుడే మనశాంతికూడా అందులో ఇమిడి ఉంటుంది. కేవలం తన స్వార్థాన్ని తన సుఖాన్ని, తన ఆనందాన్ని మాత్రమే ఆశించకుండా జగత్తుయొక్క కళ్యాణాన్ని జగత్తుయొక్క ఆనందాన్ని ఆశించడం సరియైన ఆస్తిక లక్షణం.

**సమత్వ దృష్టి**

**జగతిని జీవించువాడు మనుజుడు కావలె మొదట**
**దనుజులు దుష్కృతులనెల్ల పొగడుచుండువాడు చవట.**

కనుక, మొట్టమొదట మనము దైవచింతన చేయడానికి తగిన కృషిచేసి తరించడానికి ప్రయత్నించాలి. ఏది ఆధారమో, ఏది ప్రధానమో అనే విచారణకూడా చేయాలి. ఆధారమైనదానిని మరచిపోయి ఆధేయమైన దానికోసం ప్రాకులాడటంచేత ఆనందం మనకు లభ్యం కాదు. చక్రాలు లేని రథం ఉంటుందా? నీళ్ళులేని పంట ఉంటుందా? నీరు, ఎరువు ఉన్నప్పుడే పంట పండుతుంది. రెండుచక్రములున్నప్పుడే రథమవుతుంది. అదే విధంగా ప్రేమ, విశ్వాసము లేనప్పుడు మానవత్వం రూపొందదు. పక్షికి రెండు రెక్కలు ఎట్లా ఆధారమో, బండికి రెండు చక్రములు ఎట్లా ప్రధానమో మానవునికి ఈ రెండుకూడా అట్లా ప్రధానము. సుఖములు దుఃఖములు వస్తుంటాయి, పోతుంటాయి. వాటి నన్నిటిని మనము సమంగా భావించాలి, అనుభవించాలి.

మనము ఉగాది పండుగరోజు వేపపూత, బెల్లం, పులుపు, వగరు, అన్నీ కలిపి పచ్చడి చేసుకొని భుజించడంలోని అంతరార్థమిదే! సుఖము, దుఃఖము, కష్టము, నష్టము, నిందలు, నిష్ఠురములు అన్నిటినీ సమంగా స్వీకరిస్తామని ఈనాడు ప్రమాణము చేసినట్లుగా

sri sathyasai vachanamrutam

జీవితములో ఆచరించడానికికూడా పూనుకోవాలి. మన పూర్వీకులు ఈ విధమైన అంతరార్థములను గ్రహించి ఆనందాన్ని పొందేవారు. కాని, ప్రాచీనుల అనుభూతులను ఆచరణలను మనం అనర్థంగా భావించి మన జీవితాలను వ్యర్థం చేసుకొంటున్నాము. ప్రాచీనుల సంప్రదాయాలన్నీకూడా చాలా పవిత్రమైనవి. ఆదర్శాన్ని అందించేవి. కనుక ఇట్టి ఆదర్శాన్ని ఆచరణలో పెట్టి ప్రచారప్రబోధలు సలిపినప్పుడే పవిత్రమైన పర్వదినముల అంతరార్థాలను గుర్తించడానికి వీలవుతుంది.

**తస్మాత్ జాగ్రత!**

ఈనాటితో అక్షయనామ సంవత్సరం ప్రారంభమైనది. ఈ సంవత్సరంలో ఏ ఒడిదుడుకులుకూడా మితిమీరి పోకుండా ఉంటాయి. ఐతే చైత్ర, వైశాఖ మాసాలలోమాత్రం ఘోరంగా ఉంటుంది. ఎండలు తీవ్రంగా ఉంటాయి. వైశాఖంలో ఇంకా మితిమీరి పోతాయి. అగ్ని ప్రమాదాలు అధికంగా ఉంటాయి. ప్రయాణాల్లో చాలా ప్రమాదాలు జరుగుతాయి. వైశాఖం దాటిన తర్వాత జగత్తులో కొంత ప్రశాంతి ఏర్పడుతుంది. జ్యోతిశ్శాస్త్రం ప్రకారం రాజకీయ సంబంధమైన ఒడిదుడుకులు మితిమీరిపోతాయి. చాలా మార్పులు జరుగుతాయి. అయితే ఇవన్నీ మంచికోసమే జరుగుతాయి. ఒక్క భారతదేశానికే కాదు, యావత్ప్రపంచములో కూడా ఈవిధమైన మార్పులు జరుగుతాయి. కనుక 'లోకా స్సమస్తా స్సుఖినో భవంతు' ప్రపంచమంతా శాంతిగా, సుఖంగా సరియైన స్థితిని అనుభవించాలని ప్రతి ఒక్కరు ప్రార్థించడం అత్యవసరం.

మరొక చిన్న విషయం. కొన్ని జాగ్రతలు తీసుకోవడం చాలా అవసరం. ఎంత మంచిగా ప్రవర్తించినా, మన పదములు మాటలు ఎంత మృదుమధురంగా ఉండేట్టు చూసుకున్నా కొన్ని విధములైన ద్వేషములు అధికమవుతుంటాయి. మిత్రులు, శత్రువులు కావడానికి అవకాశముంటుంది. కాని, మాటలు జాగ్రతగా వచ్చేట్లు చూసుకోవాలి. గొడ్డలితో కొట్టిన చెట్టయినా చిగిరిస్తుంది కాని మాటలతో విరిగిన మనస్సును అతకడం సాధ్యంకాదు.

sri sathyasai vachanamrutam

**అక్షయం అక్షయమే**

> **ఇనుము విరిగెనేని ఇమ్మారు ముమ్మారు**
> **కాల్చి అతుకవచ్చు కమ్మరీడు**
> **మనసు విరిగెనేని మరి అతుకవచ్చునా?**

కనుక, ఈ సంవత్సరంలో మాటలను మృదువుగా ఎవరికి, ఏ విధమైన బాధలు కలిగించకుండా మాట్లాడటానికి ప్రయత్నించాలి. సాధ్యమైనంతవరకు రక్తాక్షి, క్రోధనంకంటే అక్షయ మంచినే అందిస్తుంది. క్రోధన గడిచిపోయిన తర్వాత కూడా దాని ప్రభావము కొంత అక్షయలో కనిపిస్తుంది. ఫ్యాను బాగా స్పీడుగా తిరుగుతూవుంటే స్విచ్చి వేయగానే అది నిలువదు. అట్లే తిరిగి, తిరిగి ఆగడానికి కొంత సమయం తీసుకొంటుంది. అట్లే రక్తాక్షి ప్రభావం క్రోధనపైన క్రోధన ప్రభావం అక్షయపైన కొంత పడుతుంది. చైత్ర, వైశాఖములు రెండుకూడా జాగ్రతగానే గడుపుకోవాలి. రెండూ గడిచిన తర్వాత అక్షయమునకు అక్షయమే! మనలో మనము అక్షయాన్ని అభివృద్ధిపరచుకొంటే ఏ సంవత్సరం, ఏ నెల వచ్చినప్పటికీ మనం దానికి వెరువనక్కర లేదు. అక్షయ భావాలు కుక్షిలో నింపుకొని దివ్యమైన నడతలచేత మన భావాలను సార్థకం గావించుకోవాలని, ఈ పవిత్రమైన అక్షయనామ సంవత్సరంనుంచి మనం మంచి తలంపులను, పవిత్రమైన భావాలను అభివృద్ధిపరచుకోవాలని, ఆశిస్తూ ఆశీర్వదిస్తూ నా ప్రసంగాన్ని విరమిస్తున్నాను. ప్రతి వ్యక్తి లోకక్షేమాన్ని మాత్రం తప్పనిసరిగా కోరాలి. అందుకు ప్రార్థించాలి. సంకుచిత భావాలనుండి విశాల భావాలలోనికి ప్రవేశించాలి. తన క్షేమం కాకుండా లోకక్షేమం ఆధారం కావాలి. అవకాశమున్న ప్రతిక్షణంలోను నామస్మరణ చేస్తూ వుండండి.

**(తేదీ 10-04-1986న భగవాన్ శ్రీ సత్యసాయిబాబావారి దివ్యోపన్యాసము)**

sri sathyasai vachanamrutam